కేసీఆర్‌పై రైల్‌రోకో కేసు నిలుపుదల

ప్రజాప్రతినిధుల కోర్టు కేసుపై హైకోర్టు స్టే

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగంగా నమోదైన రైల్‌రోకో కేసులో మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. కేసీఆర్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో ఉన్న కేసు విచారణను నిలిపివేస్తూ హైకోర్టు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. చార్జిషీట్‌లోని అంశాలను పరిశీలిస్తే రైల్‌రోకో కార్యక్రమంలో కేసీఆర్ ప్రత్యక్షంగా పాల్గొనలేదని తేలుతున్నదని అభిప్రాయపడింది. రైల్‌రోకోలో పాల్గొన్న కల్వకుంట్ల కవితతోపాటు మిగిలినవారిని అరెస్ట్ చేసినట్టు రికార్డుల్లో ఉన్నదని తెలిపింది. అందువల్ల కేసీఆర్‌పై కేసును కొనసాగించడం చట్టప్రక్రియను దుర్వినియోగపరచడమేనని వ్యాఖ్యానించింది. అందుకే ఆ కేసు విచారణను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ కేసులో కోర్టు రైల్వే పోలీసులతోపాటు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 23కు వాయిదా వేసింది.

ఇది కేసీఆర్ ప్రభుత్వ పెద్ద విజయం: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 25(నమస్తే తెలంగాణ): రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలుచేసిన పథకాలే కేసీఆర్ సాధించిన అతిపెద్ద విజయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఎక్స్ వేదికగా కొనియాడారు. ఫార్మర్ ఫస్ట్ అన్నది కేసీఆర్ నినాదం మాత్రమే కాదని, దానికి మద్దతుగా అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ సర్కారు రైతుబంధు పేరుతో దేశంలోనే మొట్టమొదటి వ్యవసాయ ఇన్‌పుట్ సహాయ కార్యక్రమం ద్వారా 70 లక్షల మంది రైతులకు రూ.73,000 కోట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. రైతు బీమా ద్వారా మృతిచెందిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా అందించారని, రెండు విడతల్లో రూ.25,000 కోట్ల వరకు రైతు రుణాలను మాఫీ చేశారని, మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువులను పునరుజ్జీవనం కల్పించారని, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్, సీతారామ వంటి నీటి పారుదల ప్రాజక్టులను నిర్మించారని కేటీఆర్ తెలిపారు.

మంగళవారం ఎర్రవల్లిలోని తన నివాసంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో సమావేశమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, అరికెపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, టీ ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి.

కొందరు పోయినా నష్టం లేదు

- మళ్లీ మంచిరోజులొస్తాయి
- ప్రజలతో మమేకం అయ్యేది బీఆర్ఎస్సే
- ఇంతకు ముందు పార్టీ ఇలాంటివి ఎన్నో చూసింది
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎన్ని జరిగినా భయపడలేదు
- తనను కలిసిన పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కేసీఆర్

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): కొందరు నాయకులు బీఆర్ఎస్‌ను వీడినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదని పార్టీ అధినేత, మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, పార్టీకి తిరిగి మంచిరోజులు వస్తాయని భరోసా ఇచ్చారు. ప్రజలతో మమేకమయ్యేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. పలువురు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు మంగళవారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఆయన వారితో చర్చించారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. పార్టీ తొలినాళ్ల నుంచి అనేకమంది అనేక విధాలుగా అవమానాలకు, అవహేళనలకు గురిచేసినా బీఆర్ఎస్ ముందుకు సాగిన తీరును వివరించినట్టు సమాచారం. 2004 అనంతరం రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఎదురైన పరిస్థితులు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను ఆయన ఉదహరించినట్టు పార్టీ నేతలు తెలిపారు. పార్టీ నుంచి కొందరు వెళ్లిపోయినంత మాత్రాన ఏదో జరుగుతుందని భయపడాల్సిన పనిలేదని ఆయన వారికి భరోసా ఇచ్చినట్టు సమాచారం. వైఎస్ హయాంలో ఇలాంటివి ఎన్ని జరిగినా భయపడలేదని వారికి గుర్తుచేసినట్టు తెలిసింది.

చేతగాని సర్కారుకు చేతులెక్కువ

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం ఇచ్చి దాదాపు ఏడు నెలలు కావస్తున్నా ఒక్క మంచి పనినైనా చేసిందా? అని వ్యాఖ్యానించారు. రైతులు, చేనేత కార్మికులు, యువకులు, మహిళలకు ఉపయోగపడే పనులేమైనా జరిగాయా? కనీసం పింఛన్లు అయినా ఇస్తున్నరా? అని ఆయన ఆరా తీశారు. ఆయా నియోజకవర్గాలలో క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వంపై అప్పుడే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నదని ఒకరిద్దరు నేతలు ప్రస్తావించగా.. 'చేతగాని సర్కారుకు చేతులెక్కువ' అన్నట్టే తయారైంది పరిస్థితి అని వ్యాఖ్యానించారు.

నేతన్నల ఆత్మహత్యలపై కేసీఆర్ ఆవేదన

రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, ఆ నిర్ణయాలతో కాంగ్రెస్ పార్టీలోనే పెల్లుబుకుతున్న అసంతృప్తిని ఈ సందర్భంగా నాయకులు కేసీఆర్‌కు వివరించినట్టు సమాచారం. పాలనపై దృష్టిపెట్టకుండా సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ఢిల్లీ టూర్లు, మంత్రుల సమన్వయలోపం వంటి విషయాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. రోజురోజుకు రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు, నేతన్నల ఆత్మహత్యల ఘటనలపై కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారని పార్టీ నేతలు పేర్కొన్నారు. హామీల అమలులో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని, సీఎం అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ రోజురోజుకు పట్టు ను సాధించలేకపోతున్నారని నేతలు వివరించినట్టు తెలిసింది. కేసీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, పార్టీ నేత క్యామ మల్లేశ్ ఉన్నారు.

బడ్జెట్ సన్నాహక సమావేశాలు షురూ

వ్యవసాయానికి బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష • మంత్రి తుమ్మలతో డిప్యూటీ సీఎం భట్టి హాజరు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన వార్షిక బడ్జెట్ సన్నాహక సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు. పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశంలో ఆయన ప్రవేశపెట్టనున్నారు. వ్యవసాయ రంగానికి కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, కళాశాలలే లేని జిల్లాల వివరాలపై వారు చర్చించారు. సీడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపైనా ఆరా తీశారు. వ్యవసాయ కళాశాలల్లో విత్తన అభివృద్ధి తీరుపైనా చర్చించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిలిపివేసిన వ్యవసాయ పథకాలేంటి? అందుకు గల కారణాలను డిప్యూటీ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఆర్థిక శాఖ అడిషనల్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించేందుకు నీటిపారుదలశాఖ మంగళవారం జలసౌధలో సమావేశమైంది. వివిధ సర్కిళ్ల సీఈలు, వివిధ విభాగాల ఇన్‌చార్జులు సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులకు బడ్జెట్ ప్రతిపాదనల్లో అగ్రస్థానం కల్పించాలని నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు.

విచారణకు హాజరవ్వండి

కేసీఆర్‌కు జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ మరో నోటీసు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు ప్రాజెక్టులు, కొనుగోలుకు సంబంధించి గత ప్రభుత్వ నిర్ణయాలపై తమ ముందు విచారణకు హాజరుకావాలని జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసు పంపింది. ఈ నెల 19న నోటీసు పంపిన కమిషన్ వారం రోజుల గడువు విధించింది. ఆ గడువు బుధవారంతో ముగియనుంది. కమిషన్ ఆప్ ఎంక్వైరీ యాక్ట్ -1952 సెక్షన్ 8 (బీ), సెక్షన్ 8 (సీ) ప్రకారం ప్రత్యక్షంగా హాజరై, తగు ఆధారాలను కమిషన్ ముందు సర్పించాలని సూచించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై విచారణ జరుపుతున్న ఈ కమిషన్ కేసీఆర్‌కు గతంలో లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ లేఖకు స్పందనగా జూన్ 14న కేసీఆర్ 12 పేజీల వివరణను కమిషన్‌కు పంపించారు. ఆ తదనంతర పరిణామాల నేపథ్యంలో విచారణకు ప్రత్యక్షంగా హాజరవ్వాలని కేసీఆర్‌ను కోరింది. ఇదే అంశంపై ఇప్పటికే విద్యుత్తుశాఖ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు.. గతంలో విచారణకు హాజరైన వారిలో మరికొందరిని మరోసారి విచారణకు హాజరవ్వాలని ఆదేశించినట్టు తెలిసింది.

కరెంట్‌పై కమిషన్ చెల్లదు

మొదటిపేజీ తరువాయి...

పేర్కొనడంపై రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి పరిశీలన తర్వాత తగిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది.

మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌లోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

విద్యుత్తు చట్టం 2003 ప్రకారం, విద్యుత్తు వ్యవహారాలపై సమీక్ష చేసి నిర్ణయాలు తీసుకొనేందుకు రాష్ట్ర విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ (ఎస్ఈఆర్‌సీ) చట్ట ప్రకారం ఏర్పాటైంది. ఎస్ఈఆర్‌సీ బహిరంగ విచారణలను నిర్వహించి ప్రజాభిప్రాయాలు స్వీకరిస్తుంది. ఎస్ఈఆర్‌సీ నిర్ణయాలతో విభేదించిన వాళ్లు ఎలక్ట్రిసిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకోవచ్చు. ఈ అప్పిలేట్ అథారిటీలో వాదనలు వీగిపోతే, సుప్రీంను ఆశ్రయించే వెసులుబాటు ఉంది. ఈ తరహా చట్ట నిబంధనలను తుంగలోకి తొక్కి కమిషన్ ఏర్పాటుచేయడాన్ని చట్ట వ్యతిరేకంగా ప్రకటించాలి.

తక్కువ ధరనే నిర్ణయించాం

దక్షిణాది రాష్ట్రాలన్నీ విద్యుత్తు కొరతతో ఉన్నాయి. టీఎస్ ఎస్పీడీసీఎల్ విచారణ జరిపి దక్షిణాది రాష్ట్రాల్లో కేవలం ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే మిగులు విద్యుత్తు ఉన్నదని తేల్చింది. ఫలితంగా ఛత్తీస్‌గఢ్‌తో చర్చలు జరిపాం. విద్యుత్తు సరఫరాకు ఛత్తీస్‌గఢ్ అంగీకరించడంతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరాకు 2014లో ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాం. నిజానికి తమిళనాడు యూనిట్ 4.94, కర్ణాటక 4.33కు కొనుగోలు చేస్తుండగా తెలంగాణ మాత్రం 3.90గానే నిర్ణయించింది. మార్వా ప్లాంట్ పనులను పరిగణనలోకి తీసుకుని 2015 సెప్టెంబర్‌లో కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నాం. వీటిని కమిషన్ ఏమాత్రం ప్రస్తావించకుండా మార్వా ప్లాంట్ 2016 మార్చిలో వచ్చిందని, పవర్ ప్లాంట్ లేకుండానే విద్యుత్తు కొనుగోలు ఒప్పందం సరికాదని చెప్పడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం

విద్యుత్తు కొనుగోలు వ్యవహారం రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం. ఈ విషయాన్ని కూడా కమిషన్ ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనపుడు జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం కాలేదు. దక్షిణాది రాష్ట్రాల్లో అయిదు రాష్ట్రాలు మాత్రమే అనుసంధానమై ఉన్నాయి. తెలంగాణకు గ్రిడ్ సంధాన సౌకర్యం లేకపోవడంతో లైన్ ద్వారా విద్యుత్తు సరఫరాకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఎల్) అనుమతి తీసుకున్నాం. అంతరాష్ట్రాల మధ్య విద్యుత్తు సరఫరా వ్యవస్థ నియంత్రణకే ఈ సంస్థ ఏర్పాటైంది. పీజీసీఐఎల్‌తో చర్చించి టీఎస్ ఎస్పీడీసీఎల్ ప్రత్యేక కారిడార్‌ను బుక్ చేసుకున్నాం. భద్రాద్రి ప్రాజెక్టుకు పర్యావరణ చట్టంతోపాటు అన్ని అనుమతులను తీసుకున్నాకే చేపట్టాం.

సీఎంగా కీలక చర్యలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండుసార్లు సీఎంగా బాధ్యతలు నిర్వహించాను. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రధానంగా విద్యుత్తు సమస్య తీవ్రంగా ఉన్నది. దీనిని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాను. ఉమ్మడి ఏపీలో తీవ్ర విద్యుత్తు కోతలతో ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. అప్పుడు వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరిశ్రమలకు వారానికి రెండు రోజులుపాటు లేఆఫ్ కూడా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక విద్యుత్తు కేటాయింపులు సరిగ్గా జరగలేదు. విద్యుత్తు సమస్య జటిలం కాకుండా ఉండేందుకు దీర్ఘకాలిక చర్యలతోపాటు స్వల్పకాలిక చర్యలు తీసుకున్నాం. శాశ్వత పరిష్కారంగా విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు చట్ట నిబంధనలకు అనుగుణంగా అన్ని సంస్థల అనుమతులతోపాటు ఎస్ఈఆర్‌సీ అనుమతులు తీసుకున్నాం.

ఎస్ఈఆర్సీ పరిధిలోనే విచారించాలన్న సుప్రీం

విద్యుత్తు చట్టం 2003 కింద ఏర్పాటైన ఎస్ఈఆర్సీ.. సమగ్ర విచారణ జరిపి ఉత్తర్వులు జారీచేసే న్యాయవ్యవస్థ. దాని పరిధిలో జరగాల్సిన వాటిని ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు ద్వారా చేయడానికి వీల్లేదు. ఎస్ఈఆర్సీ తీసుకునే నిర్ణయాన్ని సవాల్ చేసేందుకు కూడా చట్టంలో వీలుంది. అది జారీచేసే ఉత్తర్వులను సవాల్ చేసుకోవడానికి అప్పిలేట్ అథారిటీ ఉంది. ఈఆర్సీ జారీచేసిన ఉత్తర్వులకు రక్షణ ఉంది. వీటిని ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, ట్రిబ్యునల్, కమిషన్, సభ్యులు ఎవరూ ప్రశ్నించడానికి అవకాశం లేదు. కమిషన్ ఏర్పాటుచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేనేలేదు. ఎస్ఈఆర్సీ పరిధిలోని అంశాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే అది నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో తెలియజేయవచ్చు. ఈఆర్సీ నిర్ణయంపై అభ్యంతరాలుంటే అప్పిలేట్ ట్రిబ్యునల్, ఆ తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు మార్గాలు ఉన్నా వాటిని మూసివేసి ప్రభుత్వం ఎంక్వయిరీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం చట్ట వ్యతిరేకం. విద్యుత్తు చట్టంలో ఈ విషయాలు చాలా స్పష్టంగా ఉన్నప్పటికీ విద్యుత్తు శాఖ ఎంక్వయిరీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం చెల్లదు. విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ మొదలైన అన్ని అంశాలను ఎస్ఈఆర్సీ పరిధిలోనే విచారణ చేయాలని సుప్రీంకోర్టు గుజరాత్ ఊర్జా వికాస్ వర్సెస్ ఏఆర్ పవర్ లిమిటెడ్ కేసులో కీలక తీర్పు చెప్పింది.

రేవంత్‌రెడ్డే అప్పీల్ చేయలేదు

ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలపై పలువురితోపాటు అప్పటి తెలంగాణ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆ పార్టీ ఎమ్మెల్యే ఏ రేవంత్‌రెడ్డి కూడా ఎస్ఈఆర్సీలో అభ్యంతరాలు వ్యక్తంచేశారు. అప్పుడు ఎస్ఈఆర్సీ అందరి వాదనలు విన్న తర్వాత ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వులపై నాడు విపక్ష ఎమ్మెల్యేగా ఉన్న నేటి సీఎం రేవంత్‌రెడ్డి అప్పిలేట్ అథారిటీలో అప్పీల్ చేయలేదు. అయితే, విద్యుత్తు కొనుగోళ్లు, టారిఫ్‌లకు సంబంధించి డిస్కం మాత్రం అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసింది. ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. అప్పుడు అప్పీల్ కూడా చేయని రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తన అధికారాలను అడ్డం పెట్టుకుని విద్యుత్తు వ్యవహారాలపై విచారణ కమిషన్‌ను నియమించారు.

నిష్పాక్షికంగా లేని జస్టిస్ నరసింహారెడ్డి

చట్టప్రకారం ఎస్ఈఆర్సీ వంటి జ్యూడీషియల సంస్థ విచారించిన వ్యవహారంపై ఏవిధమైన తదుపరి విచారణ అవసరం లేదని చెప్పాల్సిన జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నన్ను విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేశారు. చట్టసభల ఎన్నికల కారణంగా బిజీగా ఉన్నందున కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యేందుకు గడువు కావాలని కోరాను. ఇదే సమయంలో జస్టిస్ నరసింహారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇది తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఎంవోయూ కుదుర్చుకోవడం, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంట్లలో సబ్‌క్రిటికల్ సాంకేతికతను వినియోగించడం వంటి సరికాదనే అభిప్రాయాన్ని ఆయన వెల్లడించారు. భద్రాద్రి ప్లాంట్‌లో ఆ విధమైన సాంకేతికత వినియోగం వల్ల రూ.250 కోట్ల నుంచి రూ. 300 కోట్ల వరకు నష్టం జరిగిందని నిర్ధారణకు వచ్చినట్టు జస్టిస్ నరసింహారెడ్డి వెల్లడించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. పూర్తిస్థాయిలో విచారణ చేయకుండానే ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చేసిన కమిషన్.. అది సమర్పించబోయే నివేదిక ఎలా ఉంటుందోననే అనుమానాలు కూడా లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో తాను కమిషన్‌కు వివరాలను ఇవ్వడం వల్ల ఏవిధమైన ప్రయోజనమూ ఉండదు. మొత్తంగా చూస్తే కమిషన్ విచారణ ప్రక్రియ అంతా ఏకపక్షంగా చట్ట వ్యతిరేకంగా జరుగుతున్నది. నాకు నోటీసు ఇచ్చిన కమిషన్ నా వివరణ లేదా సమాధానం ఏమిటో తెలియకుండానే ఆ విధంగా వెల్లడించడం సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకం అవుతుంది. జస్టిస్ నరసింహారెడ్డి నిష్పాక్షికంగా వ్యవహరించడం లేదు. కమిషన్ ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇవ్వకముందే ముందే జస్టిస్ నరసింహారెడ్డి ఒక నిర్ణయానికి వచ్చేశారు. నేను తప్పు చేసినట్టుగా విలేకరుల సమావేశంలో చెప్పడాన్ని బట్టి చూస్తే విద్యుత్తు వ్యవహారాలపై కమిషన్ విచారణ నామమాత్రమేనని స్పష్టం అవుతున్నది.

విధివిధానాల్లో భాగమే బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టు

థర్మల్ పవర్ ప్లాంట్లు 30 శాతం బొగ్గును ఫ్లైయాష్‌గా ఉత్పత్తి చేస్తాయి. వీటిని పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా సురక్షితంగా పారవేయాలి. ఫ్లైయాష్‌ను సిమెంట్ పరిశ్రమలు వినియోగిస్తాయి. అలాంటి అనేక సిమెంట్ ప్లాంట్లు దామరచర్ల చుట్టుపక్కల ఉన్నాయి. వాటికి బూడిద తరలింపు చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. చాలావరకు విద్యుత్తు కేంద్రాలు ఉత్తర తెలంగాణలో ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, తీవ్రవాద కార్యకలాపాలు వంటి ఏదైనా అనుకోని సంఘటనలు సంభవించినప్పుడు రాష్ట్రం మొత్తం విద్యుత్తు సరఫరాలో అంతరాయానికి ఆస్కారం ఉంటుంది. అనేక థర్మల్ పవర్ స్టేషన్లు బొగ్గు గనులకు దూరంగా ఉన్నాయి. విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్, రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్, కృష్ణపట్నం థర్మల్ పవర్ స్టేషన్ అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. యాదాద్రి పవర్ స్టేషన్‌కు బొగ్గు లింకేజీ లేదు. చాలాకాలం తరువాత కేంద్రం బొగ్గు లింకేజీ ఇచ్చింది. మణుగూరు, దామరచర్లలో థర్మల్ ప్లాంట్ల నిర్మాణ కాంట్రాక్టును బీహెచ్ఈఎల్‌కు అప్పగించడం విధి విధానాల్లో ఒకటి. తెలంగాణలో కొత్త థర్మల్ ప్లాంట్లు ఏర్పాటుచేసి విద్యుత్తు రంగంలో స్వయం సమృద్ధి సాధించాలని నిర్ణయించింది.

కమిషన్ న్యాయసూత్రాలకు విరుద్ధం

మణుగూరులో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, దామరచర్లలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ల నిర్మాణాలపైన, ఛత్తీస్‌గఢ్‌తో ఎంవోయూ, విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందాలు (పీపీఏ)లపై విచారణకు మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిషన్ చట్ట వ్యతిరేకం. కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు. విద్యుత్తు వ్యవహారాలపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సరైనవో కాదో తేల్చేందుకు కమిషన్ ఏర్పాటు చేయడం చెల్లదు. విచారణ కమిషన్ ఏర్పాటుకు వీలుగా విద్యుత్తు శాఖ జారీచేసిన ఉత్తర్వులు చట్ట వ్యతిరేకమని ప్రకటించాలి. విద్యుత్తు కొనుగోళ్లు, సరఫరా, ఒప్పందాలు, వివాదాలపై విచారించే పరిధి ఎస్ఈఆర్సీకి మాత్రమే ఉన్నది. కమిషన్ ఏర్పాటుచేసే పరిధి, అధికారం ప్రభుత్వానికి లేవు. విద్యుత్తు శాఖ చట్టంలో కూడా ఆ విధమైన వెసులుబాటు లేదు. కాబట్టి కమిషన్ నియామకమే చెల్లదు. ప్రభుత్వం జారీచేసిన జీవో కేంద్రం తీసుకువచ్చిన విద్యుత్తు చట్టానికి కూడా విరుద్ధం. విద్యుత్తు చట్టంలోని సెక్షన్ 61, 62, 86లకు వ్యతిరేకం. ప్రభుత్వం విచారణకు నిర్దేశించిన అంశాలన్నీ ఎస్ఈఆర్సీ పరిధిలోనే ఉన్నాయి. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా కమిషన్ ఏర్పాటు జరిగింది. కమిషన్ విచారణ సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని, చట్టవిరుద్ధమని పేర్కొంటూ పూర్తి వివరాలతో కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డికి లేఖ రాయడం జరిగింది. అయినప్పటికీ కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి కొనసాగడం రాజ్యాంగ, చట్టవిరుద్ధం. కమిషన్ ముందు హాజరై ఆధారాలను సమర్పించాలని కోరుతూ ఈ నెల 19న కమిషన్ జారీచేసిన ప్రొసీడింగ్స్, కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ 1952 నిబంధనలకు విరుద్ధం. కమిషన్ నోటీసు జారీ చేయడాన్ని రద్దు చేయాలి.

అప్రతిష్టపాలు చేసేందుకే..

ప్రజాహిత వ్యవహారాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ కమిషన్ ఏర్పాటు చేయవచ్చు. విద్యుత్తు వ్యవహారంపై కమిషన్ ఏర్పాటు మాత్రం ఆ విధంగా జరగలేదు. కేవలం గత ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా కమిషన్ ఏర్పాటు జరిగింది. వాస్తవానికి ప్రభుత్వానికి విద్యుత్తు కొనుగోళ్లు, పీపీఏలపై కమిషన్ ఏర్పాటు చేసే అధికారం చట్టంలో లేదు. అయినా లేని అధికారాలను తెచ్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ చైర్మన్ తన పరిధి దాటి విచారణ పూర్తికాకుండా విచారణలో తెలుసుకున్న అరకొర వివరాలను ఆధారంగా చేసుకొని ఒక నిర్ణయానికి వచ్చేసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దీంతో విచారణ కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని స్పష్టం అవుతున్నది. కాబట్టి కమిషన్ జారీచేసిన నోటీసును కూడా రద్దు చేయాలి. కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ వెలువడిన జీవోను సైతం కొట్టివేయాలి.

క్లిష్ట పరిస్థితుల్లో కీలక నిర్ణయాలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పాలనా పగ్గాలు అందుకున్నాను. ఏనాడూ విద్యుత్తు కొరత అనేది తలెత్తకుండా నిర్ణయాలు తీసుకున్నాను. విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందాలు చేసుకోవడం ద్వారా పరిశ్రమలకు కూడా ఇబ్బందులు తలెత్తకుండా చేశాను. గతంలో ఉమ్మడి ఏపీలో పరిశ్రమలు వారంలో రెండు మూడు రోజులు మూతపడే దుస్థితి ఉండేది. రైతులు ఆత్మహత్యలు చేసుకునే ఘటనలు కూడా ఉన్నాయి. వ్యవసాయం చేయడం కష్టతమని భావించే పరిస్థితుల నుంచి పూర్తి సాగుపై రైతులు మక్కువ చూపేలా చేయడానికి విద్యుత్తు సరఫరా ఎంతగానో దోహదపడింది.

మిగులు ఉన